'డబుల్' ఇండ్లలో వసూళ్ల దందా

నెలకు రూ.1000 వసూలు ఆందోళనలో లబ్ధిదారులు

II లో

నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 21 మే 2025 | HYDERABAD

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ, వైద్య సేవలందిస్తున్న కిమ్స్ ఉషాలక్ష్మి సెంటర్‌ను మంగళవారం సందర్శించిన మిస్ వరల్డ్ సుందరీమణులు

నిధుల్లేక.. చేతులెత్తేశారు

- హెచ్ సిటీ ప్రాజెక్టుపై కమ్ముకున్న నీలినీడలు..
- భూ సేకరణకు నిధుల గండం
- రూ. 760 కోట్ల నిధుల మంజూరుకు వినతి
- ముందుకు కదలని భూసేకరణ, ప్రాజెక్టులు

సిటీబ్యూరో, మే 20 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హెచ్ సిటీ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏడాదిన్నర క్రితం ఎంతో ఆర్భాటంగా తీసుకున్న ఈ ప్రాజెక్టు పనులు ఇప్పట్లో ముందడుగు పడే పరిస్థితులు కనబడటం లేదు. ఇందుకు భూ సేకరణకు వెంటాడుతున్న కష్టాలే కారణమని చెప్పక తప్పదు. వాస్తవంగా ఫ్లై ఓవర్లు..ఆర్వోబీ..ఆర్‌యూబీలు, రహదారులు, నాలాల విస్తరణ..లింకు రోడ్లు..అభివృద్ధి ఏదైనా సకాలంలో ప్రాజెక్టు పూర్తి కావాలంటే భూసేకరణ అత్యంత కీలకం. ఆయా ప్రాజెక్టు వ్యయం ఎంత ఖర్చు అవుతుందో..భూ సేకరణకు అంతే స్థాయిలో వ్యయం అవుతుంది. ఐతే ఆస్తుల సేకరణలో జీహెచ్ఎంసీ మొదటినుంచి లోపభూయిష్టంగా వ్యవహరిస్తున్నది. ఒక ప్రాజెక్టు పనులు ప్రారంభం సమయంలోనే దాదాపు ఆస్తుల స్వాధీనంలో పై చేయిగా ఉండాలి. కానీ ఘనత వహించిన జీహెచ్ఎంసీ భూసేకరణపై స్పష్టత లేకుండానే ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయడం అధికారుల పనితీరుకు నిదర్శనం. ఈ నేపథ్యంలోనే ఆస్తుల సేకరణకు రూ.760 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసిన అధికారులు ఈ నిధుల మంజూరుకు సర్కార్ వైపు దీనంగా ఎదురుచూస్తున్న పరిస్థితి. ఖజానాలో నిధులు లేకపోవడం..ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేస్తుండడం..వెరసి నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తే గానీ ప్రాజెక్టులకు అంగీకరించే పరిస్థితి కనిపించడం లేదు.ప్రాజెక్టు విభాగం అధికారులు మాత్రం అత్యుత్సాహాన్ని ప్రదర్శించి టెండర్ల ప్రక్రియను ఆగమేఘాల మీద పూర్తి చేస్తుండడం విశేషం.

కేబీఆర్ పార్కు చుట్టూ ..

కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాసుల నిర్మాణం రోజురోజుకు మరింత జఠిలంగా మారుతోంది. రోడ్డు విస్తరణలో భాగంగా తమ ఇంటి స్థలాలను కోల్పోతున్న వారి నుంచి తీవ్రమైన ప్రతిఘటన వ్యక్తం కావడం..న్యాయపరమైన చిక్కులు పెరుగుతుండడంతో.. ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. కేబీఆర్ పార్కు ఫ్లై ఓవర్లు, అండర్ పాసుల నిర్మాణంలో అత్యంత క్లిష్టమైన ప్రక్రియగా భూసేకరణ నిలుస్తోంది. సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు ఇతర బడా పారిశ్రామిక వేత్తలకు సంబంధించిన ఆస్తుల స్వాధీనం అధికారులకు తలనొప్పిగా మారుతుండగా.. వరుస కోర్టు వివాదాలతో భూసేకరణ ప్రక్రియను ఎలా పూర్తి చేయలేదని సమస్యగా మారుతోంది.

అభాసుపాలవుతున్న ప్రాజెక్టు..

హెచ్ సిటీ ప్రాజెక్టుల్లో భాగంగా రూ. 7032 కోట్ల పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేయగా..ఇందులో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, ఆర్వోబీలు, ఆర్‌యూబీలు, రహదారి విస్తరణ పనులు ఉన్నాయి. 38 ప్రాజెక్టులు ఉండగా 28 ఫ్లై ఓవర్లు, 13 అండర్‌పాస్‌లు, నాలుగు ఆర్వోబీలు, మూడు ఆర్‌యూబీలు, పది చోట్ల రహదారి విస్తరణ పనులకుగానూ కొన్నింటికి టెండర్లు పిలిచారు. వచ్చే రెండు నెలల్లో టెండర్ల ప్రక్రియను పూర్తి చేస్తామని ఇంజనీర్లు చెబుతున్నారు. ఐతే భూసేకరణలో భాగంగా నిర్వాసితులకు పరిహారం ముందుగా చెల్లించాల్సి ఉంది. ఐతే బీఆర్ఎస్ హయాంలో ఎస్ఆర్‌డీపీ ద్వారా 47 ప్రాజెక్టులు చేపట్టి 36 ఫ్లై ఓవర్లతో అనతికాలంలోనే అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులను చేపట్టినప్పుడు నగదు పరిహారానికి ప్రత్యామ్నాయంగా ట్రాన్స్ డెవలప్‌మెంట్ రైట్స్(టీడీఆర్) ద్వారా పరిహారం అందించారు. దాదాపు రూ.3700 కోట్ల పైచిలుకు టీడీఆర్ బాండ్స్ భూ నిర్వాసితులకు జీహెచ్ఎంసీ అందచేసింది. దీంతో రూ.3700 కోట్ల మేరకు భారీ మొత్తంలో వ్యయానికి సంబంధించిన భారం తప్పింది. కానీ ఈ ప్రభుత్వ హయాంలో టీడీఆర్ పరిహారానికి నిర్వాసితులు మొగ్గుచూపే పరిస్థితి లేదు. ముఖ్యంగా పాతబస్తీ ప్రాంతంలో టీడీఆర్‌లకు ససేమిరా అంటున్నారు.

చంపాపేట వద్ద బీఆర్ఎస్ హయాంలో పనులు మొదలై.. కాంగ్రెస్ హయాంలో నిధుల్లేక పనులు మందగించిన దృశ్యం

హెచ్‌సిటీ ప్రాజెక్టుల్లో కీలకమైనవి..

- చందానగర్ నుంచి అమీన్‌పూర్ మీదుగా ఓఆర్ఆర్ అనుసంధానం చేస్తూ 2.7 కిలోమీటర్ల మేరలో రూ. 45 కోట్లతో 150 ఫీట్ల రహదారి విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది.
- జీడిమెట్ల ఫాక్స్ సాగర్ నాలా మీదుగా నాలుగు లేన్ల బ్రిడ్జిల నిర్మాణం రూ.56 కోట్లతో చేపట్టనున్నారు.
- ఐఐఐటీ జంక్షన్లలో మల్టీ లెవల్ ఫ్లై ఓవర్ అండ్ అండర్‌పాస్ నిర్మాణం రూ. 459 కోట్లతో 3.25 కిలోమీటర్ల మేరలో చేపడుతారు.
- ఖాజాగూడ జంక్షన్ వద్ద మల్టీలెవల్ ఫ్లైఓవర్స్ 1.52 కిలోమీటర్ల మేరలో రూ.220కోట్లతో చేపట్టనున్నారు.
- బంజారాహిల్స్ విరంచి హాస్పిటల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు రూ.150కోట్లతో 100, 120 ఫీట్లతో రహదారుల విస్తరణ
- అజీంహోటల్ నుంచి చర్చి గేట్ వరకు (షోహిబ్ హోటల్ నుంచి బాలాపూర్ రోడ్ వరకు), చాంద్రాయణ గుట్ట క్రాస్ రోడ్ నుంచి బార్కాస్ రోడ్ వరకు వయా చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ రహదారి విస్తరణ
- బెంగుళూరు హైవే నుంచి శాస్త్రీపురం జంక్షన్ వదరకు 100 ఫీట్ల రోడ్ విస్తరణ
- ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్‌లో ఫస్ట్ లెవల్ ఫ్లైఓవర్, టీవీ 9 కార్యాలయం వద్ద అండర్ పాస్, చిలకలగూడ వద్ద ఆర్‌యూబీ
- కూకట్‌పల్లి వై జంక్షన్‌లో రెండు వైపులా 3 లేన్లతో ఫ్లై ఓవర్ల నిర్మాణ పనులకు భూ సేకరణ చేపట్టాల్సి ఉంది.

వర్షాకాలంలోపే పనులు పూర్తి చేయండి

జలమండలి ఎండీ అశోక్ రె

సిటీబ్యూరో, మే20,(నమస్తే తెలంగాణ): కోర్ సిటీలో మురుగునీటి వ్యవస్థ ఆధునీకరణ కోసం చేపట్టిన జోన్-3 సీవర్ నెట్ వర్క్ ప్రాజెక్టు పనులను మంగళవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి.. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహీయుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. టోలీచౌకి ఫ్లై ఓవర్ ప్రధాన రహదారిలో చేపట్టే టన్నెలింగ్ పనులకు ఆటంకాలు లేకుండా చేపట్టాలని సూచించారు. దాదాపు 8 నుంచి 11 మీటర్ల లోతులో జరిగే టన్నెలింగ్ పనులవల్ల ట్రాఫిక్, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వర్షాకాలంలోపే పనులు పూర్తి చేయలన్నారు. అనంతరం 7 టూంబ్స్ వెళ్లే రహదారిలో చేపట్టే అండర్ గ్రౌండ్ టన్నెలింగ్ పనులను నివాస గృహాల పటిష్టకు ఎలాంటి నష్టం కలగకుండా ఎలా చేయాలో ప్రతిపాదనలు సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే.. వర్షాకాలం సమీపించిన తరుణంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టి వేగంగా పూర్తి చేయాలని ఎండీకి విజ్ఞప్తి చేశారు. అనంతరం షేక్‌పేట్ జలమండలి కార్యాలయాన్ని సందర్శించి, పది సంవత్సరాలక్రితం నిర్మించిన 10 మి.లీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లను ఇప్పటికి వినియోగంలోకి తీసుకురాకపోవడంపై ఎండీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెంటనే రిజర్వాయర్లను వినియోగంలోకి తీసుకుని, ఏయే ప్రాంతాల్లో నీటి సరఫరా చేయవచ్చో సర్వేచేసి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, ఆపరేషన్ డైరెక్టర్ అమరేంద్రరెడ్డి, సీజీఎంలు వినోద్ భార్గవ, రాజేందర్, జీఎంలు శ్రీను నాయక్, కుమార్, ప్రాజెక్టు, ఓఅండ్ఎం అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

బీఆర్ఎస్ పోరాటం ఫలించింది..

పెంచిన చార్జీలు 10 శాతానికి తగ్గింపు

- బీఆర్ఎస్ అభ్యంతరంతో పునరాలోచనలో ఎల్ అండ్ టీ
- వెనక్కి తగ్గిన మెట్రో.. రాయితీలో అస్పష్టత

సిటీబ్యూరో, మే 20 (నమస్తే తెలంగాణ) : మెట్రో చార్జీలను పెంచాలి.. నష్టాలను భర్తీ చేసుకోవాలి.. అని అనుకున్న ఎల్అండ్‌టీ వ్యూహం బెడిసికొట్టింది. ప్రయాణికులపై పడనున్న భారంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఒత్తిడికి మెట్రో నిర్వహణ సంస్థ తలొగ్గింది. అనుకున్నట్లుగా పునరాలోచన చేస్తున్నట్లుగానే పెరిగిన ధరల్లో 10 శాతం రాయితీ ప్రకటించింది. రూ. 2 నుంచి రూ. 15 పెంచింది కానీ కొత్తగా సవరించిన ధరల్లో 10శాతం రాయితీ ఇస్తున్నట్లుగా ఈ మేరకు ఎల్ అండ్ టీ ఎండీ కేవీబీ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మే 24 నుంచి అమలులోకి తగ్గిన చార్జీలు అమలులోకి వచ్చేంత వరకు ప్రయాణికులపై పడే భారం ఎంతనేది అస్పష్టంగానే ఉంది. ఆధునిక రవాణా సదుపాయం పేరిట హైదరాబాద్ నగరవాసులపై మెట్రో నిర్వహణ సంస్థ చార్జీలను పెంచి భారం మోపింది. ఒకేసారి 20 శాతం ధరలను పెంచిన ఆ సంస్థ.. ప్రజల ఒత్తిడికి వెనకడుగు వేసినట్లుగా రాయితీలతో సద్దుమణిగేలా చర్యలు తీసుకుంది. ఈ నెల 17 నుంచి పెంచిన ధరలు అమలులోకి రావడంతో కనిష్ఠంగా రూ. 2, గరిష్ఠంగా రూ. 15 భారం పడింది. దీనిపై సామాన్య మెట్రో ప్రయాణికులతోపాటు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా పెంచిన చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున్న మెట్రో ముట్టడి, ఆందోళనలకు పిలుపునివ్వగా.. లోపభూయిష్టంగానే ఉన్న చార్జీల సవరణ ప్రతిపాదనలపై కాంగ్రెస్ సర్కారు కూడా వెనకడుగు వేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ మేరకు సవరించిన కొత్త చార్జీలపై 10శాతం రాయితీ ఇస్తున్నట్లుగా ప్రకటించి పొంగు మీద నీళ్లు చల్లే ప్రయత్నం అయితే చేసింది. దీనికి తగినట్లుగానే ఎల్అండ్‌టీ విడుదల చేసిన పత్రిక ప్రకటన కూడా సందేహంతోనే ఉండటంతో అసలు పెంచింది ఎంత..? రాయితీ ఇచ్చింది ఎంత? రాయితీ పోనూ వాస్తవ ధర ఎంతనేది ఇప్పుడు కొత్త ధరలు అమలులోకి వచ్చేంత వరకు తెలిసేలా లేదు.

10 శాతంలోనే గందరగోళం..

కొత్తగా సవరించిన చార్జీలలో 10శాతం రాయితీ ఇస్తున్నట్లుగా ఎల్ అండ్‌టీ చేయగా.. సవరించిన ధరల ప్రకారం.. మియాపూర్‌లో మెట్రో ఎక్కిన వ్యక్తి జేఎన్‌టీయూ వద్ద దిగితే రూ. 12 చార్జీ అవుతుంది. ఇందులో 10 శాతం రాయితీ అంటే రూ. 1.2 పోనూ మిగిలినది రూ. 10.80 అవుతుంది. అదే విధంగా ఎల్‌బీ నగర్‌లో ఎక్కిన వ్యక్తి ఖైరతాబాద్, లక్డీకాపూల్‌లో దిగితే రూ. 55 చెల్లిస్తున్నాడు. మే 24 తర్వాత ఇచ్చే 10శాతం రాయితీ తర్వాత ప్రస్తుత టికెట్ ధర రూ. 49.5 మారుతుందా? లేక గరిష్టంగా పెంచిన రూ. 15లో 10శాతం రాయితీ ఇస్తారనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

దిగొచ్చిన కాంగ్రెస్ సర్కార్..

నిజానికి ధరలు పెంచాలనే ప్రతిపాదనను 2023లోనే చేశామంటూ చెప్పుకొచ్చిన ఎల్ అండ్ టీ.. ఆ సమయంలోనే మెట్రో చార్జీలను పెంచేందుకు బీఆర్ఎస్ ఆమోదించలేదు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే ఈ నిర్ణయం అమలులోకి తీసుకొచ్చింది. అయితే ధరల పెంపుపై ఎలాంటి కసరత్తు చేయకుండా... కేవలం జనాలపై భారం మోపేలా ధరలు నిర్ణయించడంతో.. బీఆర్ఎస్ ఒత్తిడి పెంచింది. దీనిపై తీవ్రంగానే స్పందించిన నగర ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేసింది. దీంతో దిగొచ్చిన సర్కారు.. ప్రజా వ్యతిరేకత పెరగక ముందే దిద్దుబాటు చర్యలకు దిగింది.

పెంచిన వేతనాలు పెండింగ్‌లోనే..

మినీ అంగన్‌వాడీలకు కాంగ్రెస్ మొండిచెయ్యి

- బీఆర్ఎస్ సర్కార్‌లో అప్‌గ్రేడ్ చేసిన కేసీఆర్
- తామే అప్‌గ్రేడ్ చేశామంటున్న రేవంత్‌రెడ్డి
- ఏడాదిగా వేతనాలు ఇవ్వకుండా కాలయాపన

సిటీబ్యూరో, మే 20, (నమస్తే తెలంగాణ): మాది ప్రజాపాలనంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని రాష్ట్రమంతా కోడై కూస్తుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను మర్చిపోయి బీఆర్ఎస్ ఇచ్చిన జీవోనే తమ జీవోగా చెప్పుకుంటూ రేవంత్ సర్కార్ నమ్మబలుకుతుంది. అప్‌గ్రేడ్ చేసిన అనంతరం ఏడాది వేతనం ఇవ్వకుండా అంగన్‌వాడీ టీచర్లను ముప్ప తిప్పలు పెడుతుంది. గ్రేటర్‌లోని 236 అప్‌గ్రేడ్ అయిన మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు ఏడాదికాలంగా వేతనం అందక ఇబ్బందులు పడుతున్నారు.

టీచర్లుగా గుర్తించింది కేసీఆరే..

మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో నివసించే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాలు అందించేందుకు 2007లో మినీ అంగన్‌వాడీలను ఏర్పాటు చేశారు. వాటిలో భాగంగా ఆ ప్రాంతాల్లో అర్హత కలిగినవారు తన పరిధిలో ఉన్న బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాలు అందించేవారు. ఈ విధంగా చేస్తున్న తరుణంలో 2010 నుంచి ఎలాంటి జీవోలు లేకుండానే వాటిని మెయిన్ సెంటర్లుగా ప్రకటిస్తూ అన్నిరకాల పనులు వారితో చేయించడం మొదలుపెట్టారు. ఇదిలా ఉండగా కేవలం హెల్పర్‌ను నియమించకుండానే ఉన్న ఒక్క సిబ్బందితోనే పనిచేయించుకుంటూ వేతనం మాత్రం మినీ సెంటర్‌లో మాదిరే, ఏ మాత్రం పెంచకుండా ఇవ్వడం గమనార్హం. కేసీఆర్ అధికారంలోకి రాగానే మినీసెంటర్లలో పనిచేస్తున్నవారందరిని హెల్పర్లకు బదులు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లుగా పిలవాలని ఆదేశాలు జారీచేశారు. వారివేతనాలు సైతం పెంచాలనే లక్ష్యంతో మినీలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు జీవో తెచ్చారు. ఎన్నికల కోడ్ కారణంగా అమలు చేసేందుకు ఆస్కారం లేకుండా పోయింది.

ఆ జీవో మూడు నెలల ముచ్చటే..

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ జీవోను అమలు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. వేతనాలు పెంచి ఒక్కో అంగన్‌వాడీ టీచర్‌కు ప్రతినెలా రూ.13,650 వేతనం ఇస్తామని హామీ ఇచ్చింది. 2024 జనవరి నుంచి అమలులోకి వచ్చినా ఈ జీవో ముచ్చటగా మూడు నెలలు మాత్రమే అమలు చేశారు. పెంచిన వేతనం ఇవ్వకుండా నెలకు రూ.7800 ఇస్తూ చేతులు దులుపుకున్నారు. అదేంటని అడిగిన మినీ అంగన్‌వాడీలకు సంబంధంలేని సమాధానాలు చెప్పుకుంటూ మోసగించారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 12నెలలుగా పెంచిన వేతనాలు ఇవ్వకుండా, పాత వేతనాలను ఇస్తూ మినీ అంగన్‌వాడీల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. నేటివరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3,989 సెంటర్లలో హెల్పర్లు లేక వారి పని కూడా టీచర్లే చేస్తుండటం గమనార్హం.

ఇబ్బందులు పడుతున్నాం..

తక్కువ వేతనానికి హెల్పర్ల పని కూడా మేమే చేస్తున్నాం. పెంచిన వేతనం ఏడాదికాలంగా పెండింగ్‌లోనే ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. పేరుకు అప్‌గ్రేడ్ కేంద్రాలు, జీతం మాత్రం మినీ సెంటర్ల ప్రకారం ఇస్తున్నారు. కచ్చితంగా పెండింగ్ వేతనాలు విడుదల చేసి, హెల్పర్లను నియమించాలి. మాకు సరైన గుర్తింపునివ్వాలి. ప్రభుత్వ ఉద్యోగులు కాదని చెబుతూనే మరోవైపు ప్రభుత్వ పథకాలకు మేము అర్హులు కామని చెబుతారు.

- వరలక్ష్మి, రాష్ట్ర మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు

మంటలు ఎక్కడ మొదలయ్యాయి..?

ఇంకా నిర్ధారించుకోలేక పోతున్న ఫైర్ సిబ్బంది

- గోడలకు పగుళ్లు గుర్తించిన అధికారులు
- ఆనవాళ్లు సేకరించిన క్లూస్, ఫోరెన్సిక్ బృందాలు
- 14 ఏసీలను గుర్తించిన దర్యాప్తు బృందం
- గుల్జార్‌హౌస్‌లో వెలుగుచూస్తున్న విషయాలు
- కుటుంబ సభ్యులను విచారించిన పోలీసులు

సిటీబ్యూరో/చార్మినార్, మే 19(నమస్తే తెలంగాణ): గుల్జార్‌హౌస్ వద్ద అగ్నిప్రమాదం జరిగిన శ్రీ కృష్ణ పెరల్స్ భవనం మంటల తీవ్రతకు లోపలి భాగం తునాతునకలైంది. ఎటుచూసినా పగుళ్లే కనిపిస్తున్నాయి. అసలు భవనంలోపల మూడుఫ్లోర్లలో ఎక్కడా ఒక్క వస్తువు కూడా మిగలలేదు. మంగళవారం అగ్నిప్రమాద సంఘటనాస్థలానికి క్లూస్, ఫోరెన్సిక్ టీమ్స్ వచ్చాయి. భవనం లోపల విచారణ చేపట్టిన ఈ బృందాలు మొత్తం భవనంలో 14 ఏసీలు ఉన్నట్లుగా గుర్తించారు. ఘటనాస్థలంలో పేలిపోయినట్లుగా చెబుతున్న ఏసీ కంప్రెషర్ కొన్ని భాగాలను క్లూస్ టీమ్ సేకరించారు. ఆ తర్వాత ఘటన జరిగిన ఫ్లోర్లను పరిశీలించారు. ఘటనకు సంబంధించిన కొన్ని ప్రాథమిక ఆనవాళ్లను సేకరించినట్లు తెలిసింది. ఫోరెన్సిక్ నిపుణులు మూడుగంటలపాటు భవనమంతా తిరిగి కొన్ని ఆనవాళ్లను సేకరించి తమతో తీసుకెళ్లారు. శ్రీకృష్ణ పెరల్స్ మూడంతస్తుల భవనం పూర్తిగా డామేజ్ అయినట్లుగా గుర్తించిన అధికారులు ఈ భవన నిర్మాణంపై అనుమానాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇరుకైన ప్రదేశంలో 7 ఏసీలు నిరంతరం వాడకం వల్ల

మిగతా IIవ పేజీలో

హిమాయత్‌నగర్‌లోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

సమస్యల నిలయం స్వగృహ

- సద్భావన టౌన్‌షిప్‌లో బాధితుల ఆందోళన
- కాంగ్రెస్ సర్కార్‌లో పెరిగిన సమస్యలు
- ఖజానా ఖాళీగా ఉంది.. చావండి: ఎండీ

హిమాయత్ నగర్,మే 20: పోచారం సద్భావన టౌన్‌షిప్‌లోని రాజీవ్ స్వగృహలో కామన్ సర్వీసెస్‌ను పున: ప్రారంభించి తమ సమస్యలను పరిష్కరించాలని హిమాయత్ నగర్‌లోని తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో వద్ద మంగళవారం బాధితులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ, గోపాల్, గడ్డం బాలకృష్ణ, సాయికిరణ్, మహేశ్, బాలాజీ, అంజనేయులు, లాజరస్, గణపతి,వెంకట నారాయణ మాట్లాడారు. పేద, మధ్య తరగతికి చెందిన తాము బ్యాంక్ లోన్లు తీసుకుని 2500 ఎస్ఎఫ్‌టీ ప్లాట్లను రూ.20 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశామని తెలిపారు. అన్ని వసతులు పూర్తి చేసి చేతికి తాళాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు ప్రభుత్వం ముఖం చాటేసిందని ఆరోపించారు. ఈఎంఐ కట్టుకోలేని స్థితిలో ఉన్న తమకు మెయింటెనెన్స్ చార్జీలు చెల్లించడం వీలు కాదని తేల్చి చెప్పారు. తక్కువకు వస్తుందని ఆశపడి ఇల్లు కొనుక్కున్నామని, గృహ నిర్మాణ సంస్థ జీఎం నరేందర్‌రెడ్డిని కలిస్తే ఎండీ గౌతమ్ ను కలువాలని ఒకరిపై మరొకరు చెబుతూ తప్పించుకుంటారని మండిపడ్డారు. ప్రభుత్వ ఖజానా ఖాళీ ఉంది మీ చావు మీరు చావండని ఎండీ అంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సమస్యలు మరింత పెరిగిపోయాయన్నారు. విక్రయించని ఫ్లాట్లు (సీ1 నుంచి సీ3), (డీ1 నుంచి డీ8) బ్లాక్ లకు 1.01 పైసల్ టీజీఆర్ సీఎల్ నుంచి నిర్వహణ చార్జీలు ఇవ్వాలన్నారు. లిఫ్ట్(ఏఎంసీ), ఎస్ టీపీ, హౌస్ కీపింగ్, నీటి బిల్లు నిర్వహణ, వాటర్ టెర్రస్ ప్రూఫింగ్ తో పాటు టవర్లకు పెయింట్ వేయాలని డిమాండ్ చేశారు.